ప్రజాశక్తి
బుధవారం 7 జూన్ 2023 | 8 పేజీలు
ఎన్‌టిఆర్ | కృష్ణా





కిడ్నీ బాధితులకు అండగా ఉండాలి

కేంద్ర మంత్రి భారతీ ప్రవీణ్ పవర్



కిడ్నీ బాధితులకు అందుతున్న వైద్యంపై ఆరా తీస్తున్న మంత్రి భారతి

ప్రజాశక్తి - ఎ.కొండూరు, మైలవరం : పదిహేనేళ్లుగా కిడ్నీ క్రానిక్ సమస్యతో బాధపడుతూ వందలాది మంది గిరిజనులు మరణించడం బాధాకరమని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి భారతి ప్రవీణ్ పవర్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం చైతన్య నగర్ తండాలో మంగళవారం ఆమె పర్యటించారు. కిడ్నీ బాధితులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంపై బాధితులతో ముఖాముఖి మాట్లాడారు. స్థానిక పిహెచ్‌సి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కిడ్నీ బాధితులకు వైద్య సేవలు సరిగా అందడంలేదని పలువురు మంత్రి దష్టికి తీసుకువెళ్లారు. ఉచితంగా మందులను ఎందుకు అందజేయడంలేదని జిల్లా వైద్యశాఖ అధికారులను ప్రశ్నించారు. ఈసమస్యపై పూర్తి అవగాహన కల్పించి వారికి సరియైన వైద్య సదుపాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గ్రామంలో మంచినీటి సమస్యపై పలువురు మంత్రి దష్టికి తీసుకువెళ్లారు. కష్ణా జలాలను తాగునీరుగా అందించేందుకు గ్రామంలో సింటెక్స్ ట్యాంకులు నిర్మించారని, ఆ ట్యాంకులను అపరిశుభ్రంగా ఉంచడమే కాకుండా రెండు రోజులకు ఒకసారి మంచినీటిని అందులో పోస్తున్నారని, ఆ నీటిని తాగలేకపోతున్నామని పలువురు గ్రామస్తులు వివరించారు. అధికారుల తీరుపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. కనీసం మానవతా దక్పథంతో శుద్ధమైన కష్ణా జలాలను అందించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని ఆమె ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను హెచ్చరించారు. అనంతరం ఎ.కొండూరులోని ఆయుష్ భవనంలో రూ.40 లక్షలతో నిర్మించిన డయాలసిస్ భవనాన్ని మంత్రి సందర్శించారు. ఐరన్ ఇంజక్షన్ల కొరత ఉందని పలువురు రోగులు మంత్రి దష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిఎంహెచ్ఒ సుహాసినీ, తహశీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏవో టిప్పు సుల్తాన్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీ, డాక్టర్ దివిజ, డాక్టర్ స్వాతి హాస్పిటల్ సూపర్వైజర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిని పరిశీలించిన మంత్రి

మండల కేంద్రమైన జి.కొండూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ సందర్శించారు. ప్రధాన మంత్రి మాతవందన యోజన పథకం లబ్ధిదారులైన గర్భిణులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాతవందన యోజన పథకంకు 4,405 గర్భిణులు, మాతమూర్తులకు రూ.72 లక్షల 80 వేలు ఇప్పటి వరకు అందజేసినట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

నేడు కృష్ణాడెల్టాకు సాగునీరు

నీటి పారుదల సలహా మండలి సమావేశంలో మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి - విజయవాడ : ఖరీఫ్ పంటల సాగుకోసం బుధవారం సాగునీటిని విడుదల చేయనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. కృష్ణా జిల్లా 38వ, ఎన్‌టిఆర్ జిల్లా 2వ నీటి పారుదల సలహా మండలి సమావేశం మంగళవారం నగరంలోని నీటిపారుదల సర్కిల్ ఆవరణలోని రైతు శిక్షణ కేంద్రంలో నిర్వహించారు. ఈసమావేశంలో మంత్రి జోగి అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఖరీఫ్ పంటలకు కాల్వల ద్వారా బుధవారం నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఇంత ముందుగా సాగునీటిని విడుదల చేస్తున్న చరిత్ర గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ లేదని అన్నారు. గత ఏడాది కూడా జూన్ 10వ తేదీనే కృష్ణా డెల్టాకు సాగు నీటిని విడుదల చేశామని తెలిపారు. సముద్రంలోకి వృధాగా పోతున్న నీటిని నిల్వ చేసుకునేందుకు వీలుగా కృష్ణా డెల్టా దిగువ ప్రాంతంలో రెండు బ్యారేజీల నిర్మాణానికి అంచనాలు రూపొందించామన్నారు. ఎగువ ప్రాంతంలో దాములూరు వద్ద బ్యారేజి నిర్మాణానికి కూడా అంచనాలు రూపొందించామని, వీటికి పరిపాలనా అనుమతులు రావాల్సి ఉందని అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలోని సాగునీటి పంపిణీలో ఏమైనా లోపాలు, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కృష్ణా డెల్టాకు (మిగతా 6లో)



విజయవాడ లెనిన్ సెంటర్లో నిరసన తెలుపుతున్న సిఐటియు నేతలు, అంగన్వాడీ సిబ్బంది

హత్య చేసిన వైసిపి నేతను అరెస్టు చేయాలి

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుప్రజ డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ : అంగన్వాడీ కార్యకర్త హనుమాయమ్మను హత్య చేసిన వైసిపి నేత కొండలరావును వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్ సుప్రజ (మిగతా 6లో)

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలి

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



జాతాలో మాట్లాడుతున్న కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా), గుడివాడ : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మరోసారి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వర రావు విమర్శించారు. మున్సిపల్ అవుట్సోర్సింగ్ ఆప్కాస్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, 010 పద్దు ద్వారా వారికి వేతనాలు చెల్లించాలని, పర్మినెంట్ కార్మికులకు సంబంధించి సిపిఎస్‌ని రద్దు చేయాలని కోరుతూ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మే 30 తేదీన శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురంలో ప్రారంభించిన ప్రచార జాతా మంగళవారం మచిలీపట్నం చేరుకుంది. ఈ సందర్భంగా మచిలీపట్నం కోనేరు సెంటర్‌లో జరిగిన సభలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని నాలుగేళ్లుగా అడుగుతుంటే జీఓలు, కోర్టుల్లో కేసుల పేరుతో ప్రభుత్వం దాటవేత వైఖరి అవలంభించిందన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి ఏమిటో చెప్పాలన్నారు. అలాగే ఎంతమంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తారో చెప్పడం లేదన్నారు. ఇది మరోసారి మోసం చేయడమేనన్నారు. ఈకార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు టి.నూకరాజు, గార్లపాటి విజయలక్ష్మి, జె.నాయుడు, జి.కిషోర్ కుమార్, సిహెచ్ దేవేంద్ర కుమార్, సిహెచ్.రాజేష్, ఏ.రమాదేవి, కొల్లాటి శ్రీనివాసరావు, బూర సుబ్రహ్మణ్యం, ఎం.పోలి నాయుడు, సిహెచ్ జయరావు, సిహెచ్ బుల్లెమ్మ, టి.చంద్రపాల్, డి నాగమల్లేశ్వరరావు, ఎస్.ధనుంజయరావు పాల్గొన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు (మిగతా 6లో)

కౌలురైతుల పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నందిగామ: భూ యజమాని సంతకం తప్పనిసరి నిబంధనను సవరించాలని ఈ నెల 12వ తేదీన విజయవాడ నుండి మంగళగిరి సీసీఎల్‌ఏ ఆఫీస్ వరకు జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని కౌలు రైతులు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు కోరారు. కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నందిగామ మండలం అడవిరావులపాడు, లింగాలపాడు ,పెద్దవరం గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. అడవిరావులపాడు గ్రామంలో కౌలు రైతులను ఉద్దేశించి సైదులు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు పైగా ఉన్న కౌలు రైతులకు 2019 పంట సాగు దారుల చట్టం ప్రకారం గుర్తింపు కార్డు మంజూరుకు భూ యజమాని సంతకం తప్పనిసరి అనే నిబంధనలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో చట్టంలో మార్పులు చేసి కౌలు రైతుకు సులభంగా గుర్తింపు కార్డు మంజూరు, భూ యజమాని సంతకం తొలగింపు సాధనే లక్ష్యంగా కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జూన్ 5 నుండి 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార ాతాలు, సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల వద్ద వినతిపత్రాలు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు సూరా శ్రీనివాసరావు, జి.లక్ష్మీనారాయణ, కామసాని ప్రసన్న రాఘవాపురపు సుబ్బారావు, బండి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.


నందిగామ మండలంలో...


చందర్లపాడు మండలంలో...

ప్రజాశక్తి-చందర్లపాడు: కౌలు రైతుల పాదయాత్రను జయప్రదం చేయాలని కౌలు రైతుల సంఘం చందర్లపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో పున్నవల్లి గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేసి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం మండల అధ్యక్షుడు జి.ఏడుకొండలు మాట్లాడుతూ భూ యజమాని, కౌలు రైతులతో గ్రామ సభ నిర్వహించి అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం నాయకులు రాయిడి వెంకటేశ్వరరావు, కోట సీమోను, కోట ఏసుపాదం, నెలకుదిటి వెంకటేశ్వరరావు, అంగడాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం తహశీల్దార్‌గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం తహశీల్ధార్‌గా ఎం శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఎం.సూర్యారావు జగ్గయ్యపేటకు బదిలీ అయ్యారు. సీసీఎల్‌లో పనిచేస్తున్న శ్రీనివాసరావు బదిలీపై ఇబ్రహీంపట్నం వచ్చారు. సాధారణ బదిలీ ప్రక్రియలో భాగంగా ఇబ్రహీంపట్నం తహశీల్దార్ ఎం.సూర్యారావు ఇప్పటికే బదిలీ కాగా ఆయన స్థానంలో శ్రీనివాస్‌రావు బాధ్యతలు స్వీకరించారు.



వైసిపి పాలనలో పోలవరం భవిష్యత్తు గందరగోళం : బేగ్

ప్రజాశక్తి-వన్‌టౌన్: వైసీపీ పాలనలో పోలవరం జగమంత వైఫల్యమని, ఇది పూర్తయ్యేనా అంటూ టిడిపి పశ్చిమ మైనార్టీ నాయకులు ఎంఎస్.బేగ్ మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఘాటుగా విమర్శించారు. పోలవరం 41.15 మీటర్ల ఎత్తున నీటి నిల్వ నిధులు ఇమ్మని ప్రధాన మంత్రికి లేఖ రాసి రాష్ట్రానికి జగన్ అన్యాయం చేసారన్నారు. నాడు వైయస్సార్ హయాంలో అసంపూర్తిగా వదిలిన కాలవలను అనుసంధానం చేసి పట్టిసీమ ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసి లబ్ధి చేకూర్చింది, పోలవరం నిర్మాణాలను నాటి సీఎం చంద్రబాబు వేగవంతం చేసారని వివరించారు. జగన్ పోలవరం సాంకేతిక అర్హతలు మార్చేశారని, రివర్స్ టెండరింగ్ పేరుతో కాలయాపనచేసి ప్రాజెక్ట్ వ్యయం పెంచారన్నారు. ఇప్పటికి అదనంగా 3048 కోట్లు పెరిగిందన్నారు. రెండేళ్లలో పూర్తి అన్నారు కానీ 40 నెలలు అయ్యిందని, ప్రాజెక్ట్ భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. ముందుచూపు, సరైన వ్యూహం, అంకితభావం, పారదర్శకత లేని జగన్ రెడ్డి అత్యంత ప్రధానమైన ప్రాజెక్టును సుడిగుండంలోకి నెట్టేశాడని బేగ్ విమర్శించారు. జగన్‌కు ఇన్ని సంవత్సరముల తర్వాత పోలవరంపై ప్రేమ పుట్టుకొచ్చిందని, అది ఎందుకు అనేది ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బేగ్ ఎద్దేవా చేశారు.

చండ్ర రాజేశ్వరరావు జయంతి

ప్రజాశక్తి-నందిగామ: భారత కమ్యూనిస్టు ఉద్యమ అగ్ర నాయకులు, భూపోరాట యోధులు చండ్ర రాజేశ్వరరావు 109వ జయంతి స్థానిక సిఆర్ భవన్‌లో మంగళవారం జరిగింది. సిఆర్ చిత్రపటానికి సిపిఐ సీనియర్ నాయకులు బలుసుపాడు రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నందిగామ నియోజకవర్గ కార్యదర్శి చుండూరి సుబ్బారావు, సహాయ కార్యదర్శి కట్టా చామంతి, మండల కార్యదర్శి మన్నె హనుమంతరావు, ఎఐవైఎఫ్ అధ్యక్షులు జిల్లేపల్లి తుపాన్‌బాబు, ఏఐవైఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మౌలాలి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు మహోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ మీరా హుస్సేనీ షా ఖాద్రీ బాబా దర్గా 265 వ ఉరుసు మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా పాల్గొన్నారు.దర్గా ముజావర్ల ఇంటి వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు అల్తాఫ్ బాబా.అనంతరం ఉరుసు మహెూత్సవ వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆ బాబా గారి చల్లని దీవెనతో నందిగామ ప్రజలు సుఖ,సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించినట్లు తెలిపారు. ముజావర్ల ఇంటి నుండి ఊరేగింపుగా గంధం అర్ధరాత్రికి దర్గా చేరుతుంది.రేపు చిరాగా మరియు అన్నదాన కార్యక్రమం జరుగును.ఈ ఉరుసు మహెూత్సవంలో కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొని బాబా వారి ఆశీస్సులు పొందవలసిందిగా కోరారు.ఈ వేడుకల్లో జామా మజీద్ ముత్తవల్లి కాజా, నందిగామ ఖాజీ హఫీజ్ ఖలీల్ రజ్వీ, మత గురువులు ఇజాజ్,షేక్ జానీ,పాషా తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రజలకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం జగనన్న అందించే సంక్షేమ పథకాల క్యాలండర్‌ను మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగ మల్లేశ్వర రావు, కౌన్సిలర్లు కొలగాని రాము, వట్టెం మనోహర్, కాశీ అనురాధ కిషోర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సిఐ

ప్రజాశక్తి-నందిగామ: వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి అని సీఐ హనీష్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు.లైసెన్స్ లేకుండా, వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకుండా, అతి వేగంగా వెళుతున్న, ట్రిపుల్ రైడ్ చేస్తున్న, మైనర్లు నడుపుతున్న పలు వాహనాలను తనిఖీ చేసి జరిమానా విధించారు ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లకు ప్రత్యేకంగా సీఐ హనీష్ కౌన్సిలింగ్ ఇచ్చారు.ఈ తనిఖీలలో ట్రాఫిక్ ఎస్సై నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.





నాణ్యమైన విత్తనాలే అమ్మాలి : కెనడి

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరులోని మండల వ్యవసాయ కార్యాలయంలో విత్తనాల రీటైలర్ డీలర్లతో సహాయ వ్యవసాయ సంచాలకులు కెనడి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు అమ్మే సీజన్ మొదలైంది కాబట్టి డీలర్లు అందరూ స్టాక్ రిపోర్ట్ ఎప్పటి కప్పుడు అప్డేట్ చేసి మండల వ్యవసాయ అధికారి కార్యాలయానికి తెలియచేయాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని సూచించారు. వ్యవసాయ అధికారి పి పద్మ మాట్లాడుతూ విత్తనాలు ఎంఆర్ పి ధరకు మించి అధిక ధరలకు అమ్మి తే సీడ్ యాక్ట్ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పని సరిగా బిల్లు ఇవ్వాలని తెలిపారు. అలాగే రైతులు కూడా బిల్లు లేకుండా ఏ డీలర్ అయినా విత్తనాలు అమ్మితే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. రైతులు లైసెన్స్ లేని వారి వద్ద విత్త నాలు కొని మోసపోవద్దని, అలా ఎవరై నా మీ గ్రామాలలో లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్ముతున్నట్లైతే తమ దృష్టికి తీసుకు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి అరెస్టు

ప్రజాశక్తి-వన్‌టౌన్

విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తనకు పాల్పడిన నవోదయ కాలేజీ ఆఫ్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డిని టూటౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా, ఎట్టపాక మండలం, గోలగట్టు గ్రామంకు చెందిన మొర్రం దీనాకుమారి విజయవాడ అంబాపురం నాల్గవ లైనులో గల నవోదయ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ నందు జిఎన్ఎం మొదటి సంవత్సరం చదువుతోంది. ఇదే కాలేజీలోని హాస్టల్ బిల్డింగ్‌లో ఉంటుంది. సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ అయిన రవీంద్ర రెడ్డి కూడా ఇదే బిల్డింగ్‌పైనే కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తుంటారు. అయితే ప్రిన్సిపాల్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో దీనాకుమారి అనే విద్యార్థిని వారి బంధువులకు విషయాన్ని తెలియజేసింది. దీనిపై సోమవారం విద్యార్థినిలు, కుటుంబ సభ్యులు కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు పరిస్థితిని చక్కదిద్ది, ప్రిన్సిపాల్ రవీంద్ర రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

గజం నాగ శివరాం పుట్టినరోజు సందర్భంగా బాటసారులకు, పాదచారులకు పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మూడు వేల మందికి మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు పెనుమల్లి చంద్రమౌళి, సెక్రటరీ భారత జగన్, ఉపాధ్యక్షులు అల్లి రవిచంద్, ముసిని శివ, రచ్చ రామారావు, తుమ్మ ధనుంజయ, దామర్ల అంజి, పిల్లలమర్రి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల శాఖా గ్రంధాలయం లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం లో భాగంగా మంగళవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ అర్థరైజ్డ్ సేఫ్టీ ట్రైనర్ జి.నారాయణ సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు అగ్నిప్రమాదం లు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై అవగాహన కల్పించారు. తనకు తాను రక్షించుకోవడం,ఆస్తులు రక్షించుకోవడం,ఇతరలను రక్షించుకోవడం ఎలా అనేది నారాయణ ప్రాక్టికల్ గా అగ్ని నిరోధక సాధనలతో ను చూపించి, థియరిటికల్ గా వివరించారు. విద్యార్థులు చేత మంటలు స్వయంగా అర్పించారు,విద్యార్థులు కి నిత్య జీవితంలో ఎప్పుడైనా ,ఎక్కడైనా ఉపయోగపడుతుంది అని తెలియజేసారు,ఈ ప్రాక్టికల్ లో విద్యార్థులు పాల్గొని ఉత్సహంగా నేర్చుకున్నారు...డాన్స్ మాస్టర్ నెమలి నవీన్ నానీ ,వైదేశి ఏసుదాసు ఇరువురు కలిసి విద్యార్థులకు డాన్స్ నేర్పించారు. ప్రత్యేక అవసరాలు స్కూల్ ఉపాద్యాయుడు ఎం.కనకారావు క్రాఫ్ట్ వర్క్ విద్యార్థులకు నేర్పించారు...కవి,డ్రాయింగ్ మాస్టర్ నీలం సర్వేశ్వర రావు విద్యార్థులకు కుక్క చిత్ర పటాన్ని గీసి విద్యార్థుల చే గీయించారు... జిల్లా పరిషత్ స్కూల్ తెలుగు మాస్టర్ ఇస్మాయిల్ జనరల్ నాలెడ్జ్ లో భాగంగా 1674 జూన్ 6 న మరాఠీ సామ్రాజ్య స్థాపకుడు చత్రపతి శివాజీ కి పట్టాభి షేకం జరిగిన రోజు అని విద్యార్థులకు తెలియజేసారు.....అనంతరం విద్యార్థులు పుస్తక పఠనం చేశారు, పొడుపు కథలు, సామెతలు, పాటలు పాడినారు....అనంతరం మ్యూజికల్ ఛైర్స్ ఆడించడమయినది,విద్యార్థులు ఉత్సహంగా మ్యూజికల్ ఛైర్స్ లో పాల్గొన్నారు....అనంతరం విద్యార్థులు చెస్, షటిల్,టెన్నికాయిట్,స్కిప్పింగ్ ఆడినారు....ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు, బి.డి.సి.నిర్వహకుడు ఏ.పెరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: కష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట గ్రేడ్ 1 శాఖా గ్రంధాలయం నందు 29వ రోజు మంగళ వారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంనిర్వహించారు. ముందుగా విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. తదుపరి కవి ఉపాధ్యాయులు దోసపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రంథాలయంను ప్రతిఒక్కరు ఉపయోగించుకోవాలని, విజ్ఞానం పొందటానికి ఒక గొప్ప అవకాశం గ్రంథాలయం అని వివరిస్తూ విద్యార్థులకు గ్రంథాలయం దాని ఆవశ్యకత పై వ్యాసరచన పోటి నిర్వహించడం జరిగింది. తదుపరి ఆంగ్ల ఉపాధ్యాయులు వినోద్ కుమార్ విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ నేర్పించారు.


కంచికచర్లలో అగ్నిప్రమాదాలపై అవగాహన

పర్యావరణంపై పోటీలు

ప్రజాశక్తి-తిరువూరు

తిరువూరు, ప్రథమశ్రేణి గ్రంధాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు మంగళవారం పుస్తక పఠనం విద్యార్థులకు నిర్వహించారు. పుస్తకాలు అలవాటు చేయుటకు ఇదెంతో దోహదపడుతుందని రిటైర్డ్ ఉపాధ్యా యులు ఉమామహేశ్వరరావు తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయురాలు భరత్‌కుమారి వివిధ కాలాల్లో వచ్చే సీజనల్ వ్యాధులు గురించి విద్యార్థులకు వివరించారు. జూనియర్స్, సీనియర్స్‌కు పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు, కథలు నాయటం పోటీలు నిర్వహించారు.

ఎటిఎంల వద్ద పెరుగుతున్న మోసాలు

చల్లపల్లిలో ఘరానామోసగాడి అరెస్ట్ : పలు చోరీ కేసుల్లో నిందితుడు

ప్రజాశక్తి-చల్లపల్లి

జిల్లాలోని వివిధ బ్యాంకుల ద్వారా ఏటీఎంల వద్ద మాటు వేస్తూ కొందరు సహాయం చేస్తున్నట్లుగా నటిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. వృద్ధులకు సహాయం చేసినట్లు నటిస్తూ వారికి నకిలీ కార్డులు ఇచ్చి వారి ఒరిజినల్ ఏటీఎం కార్డులను దొంగిలించి అకౌంట్లోని నగదును డ్రా చేసే మోసగాడిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన చల్లపల్లి మండలంలో చోటుచేసుకుంది. కోనసీమ జిల్లా ఐ.పోలవరం గ్రామానికి చెందిన పి.సురేంద్రకుమార్‌ను మచిలీపట్నం సీసీఎస్, చల్లపల్లి పోలీసులు చల్లపల్లిలో అరెస్ట్‌చేసి అతని వద్ద నుంచి రూ.1.27 లక్షల నగదు, పల్సర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. సోమవారం చల్లపల్లి పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకర్ల సమావేశంలో అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ కేసు పూర్వాపరాలను వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో అవనిగడ్డ డీఎస్పీ మచిలీపట్నం సీసీఎస్ డీఎస్పీ సిహెచ్.మురళీ కష్ణ పర్యవేక్షణలో చల్లపల్లి సీఐ బి.భీమేశ్వర రవికుమార్, ఎస్ఐ సిహెచ్.చినబాబు, బందరు సీసీఎస్ ఎస్ఐలు డి.కోటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ జె.శ్రీనివాసు సిబ్బందితో కలిసి కేసు విచారణలో పాల్గొని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఎస్‌బిఐ ఎటిఎంలే లక్ష్యంగా మోసాలు

నిందితుడు సురేంద్రబాబు ప్రధానంగా ఎస్‌బిఐ ఏటీఎంల వద్దే మోసాలు చేస్తుంటాడని వెలుగులోకి వచ్చింది. నకిలీ ఏటీఎం కార్డుతో ఏటీఎం దగ్గర ఉంటూ వృద్ధులు, ఏటీఎం వినియోగం రాని నిరక్షరాస్యులు ఎవరైనా వస్తే వారికి డబ్బులు తీసుకునేందుకు సహాయం చేస్తాడనీ, ఆ తర్వాత తనవద్ద ఉన్న ఏటీఎం కార్డును వారికిచ్చి వారి ఒరిజినల్ ఏటీఎం కార్డు తన వద్ద ఉంచుకుని ఆ తర్వాత వారి అకౌంట్లలోంచి నగదు డ్రా చేయటం ఇక్కడ కొసమెరుపు. 2022 డిసెంబరు నుంచి కృష్ణాజిల్లాలో 8 ఏటీఎంల దగ్గర ఇలా నగదు డ్రా చేశాడు. అతడిపై 8 పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. చల్లపల్లిలో రెండు, గన్నవరంలో ఒకటి, చిలకలపూడిలో రెండు, అవనిగడ్డలో ఒకటి, పెనమలూరులో రెండు కేసులు నమోదయ్యాయి. చల్లపల్లి పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులో సురేంద్రకుమార్‌ను పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్‌చేశారు. మొత్తం రూ.1.90 లక్షలు నగదు డ్రా చేయగా, నిందితుని వద్ద నుంచి రూ.1.27 లక్షలు రికవరీ చేశారు. నిందితుని వద్ద స్వాధీనం చేసుకున్న బైక్‌పై రాజమండ్రి పీఎస్‌లో కేసు నమోదై ఉంది. సురేంద్రకుమార్ పై గతంలో 42 కేసులు ఉన్నాయి. 2021 ఏప్రిల్ నుంచీ 2022 డిసెంబరు వరకూ జైలుశిక్ష అనుభవించి విడుదలైన తర్వాత మళ్లీ నేరాలు చేయటం ప్రారంభించాడని పోలీసులు వివరించారు. నిందితుడు ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణాజిల్లాల్లో ఈ నేరాలకు పాల్పడినట్లుగా ధృవీకరించారు. చోరీ కేసులు నమోదైన అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందిస్తామనీ, ఆయా కేసులను వారు దర్యాప్తు చేస్తారని తెలిపారు. సీసీఎస్ పోలీసులు, చల్లపల్లి పోలీసులకు జిల్లా ఎస్పీ రివార్డులు ప్రకటించారు. రివార్డులను ఆయా అధికారులకు ఇద్దరు డీఎస్పీలు మురళీధర్, మురళీకృష్ణ అందచేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం : కైలే

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తోందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలంలోని పెనుమత్స గ్రామంలో వైసిపి ఆధ్వర్యంలో మంగళవారంనాడు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలు అన్ని



ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

తరగతుల ప్రజలకు ఎంతగానో మేలు చేకూరుస్తున్నాయన్నారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పెద్దఎత్తున జరుగుతున్నాయన్నారు. అమ్మఒడి, రైతు భరోసా, విద్యాదీవెన, చేయూత, ఆసరా, రైతుభరోసా వంటి పథకాలు ఎంతో ప్రజాధరణ పొందుతున్నాయన్నారు. తొలుత పెనమత్స గ్రామంలోని మహాయోగిని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దండమూడి బాపూజీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పెనుమత్స గ్రామ సర్పంచ్ దండమూడి అచ్చమాంబ, ఎంపీటీసీ శతి ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల మండల మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, వైసిపి నాయకులు మారపాక మహేశ్వరరావు, అగినపర్రు కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు అక్కినేని సతీష్, కొడాలి రాంబాబు, జి.బుజ్జి, యేనుగు మస్తానరావు, కాసాని శ్రీనివాసరావు, శొంఠి వెంకటేశ్వరరావు, సమ్మెట రాంబాబు, మర్రి దుర్గారావు, జుజ్జువరపు సందీప్ కుమార్, ఊరుటూరి రమేష్, పెనుమత్స గ్రామ కార్యదర్శి సునీత, పమిడిముక్కల మండల వైసిపి నాయకుడు యలమంచిలి గణేష్, రెవెన్యూ అధికారి ఏసుపాదం, పంచాయతీరాజ్ ఎఇ షరాబంది రాజు, హౌసింగ్ ఎఇ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎపై దాడికి టిడిపి ఖండన

ప్రజాశక్తి-అవనిగడ్డ

ప్రకాశం జిల్లా కొండెపి శాసనసభ్యుడు, ఎస్సీ నాయకులు డోలా బాల వీరాంజనేయ స్వామిపై వైసీపీ నాయకులు చేసిన దాడిని అవనిగడ్డ తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా కండించారు. స్థానిక టిడిపి కార్యాలయం ఎదుట మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా వీరాంజనేయ స్వామిని దూషించి దాడికి దిగితే



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వైసీపీలోని ఎస్సీ నాయకులు ఒక్కరు కూడా స్పందించలేదన్నారు. ప్రజలు, పార్టీ గళాన్ని వినిపించి ప్రభుత్వ దుశ్చర్యలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతున్నందునే వీరాంజనేయ స్వామిపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కక్ష కట్టి ఇలాంటి దాడులను ప్రేరేపిస్తున్నారన్నారు. టిడిపి అధికారంలో ఉన్న కాలంలో అవినీతి జరిగితే ఇప్పుడు అధికారంలో ఉన్న మీరు చర్యలు చేపట్టకుండా అసత్య ఆరోపణలు చేసి ఉద్దేశపూర్వకంగా దాడులకు దిగటం కక్ష సాధింపు చర్యగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ, నాయకులు గుంటూరు వినయ్, ఘంటసాల రాజమోహనరావు, కొల్లూరి వాసు, యలవర్తి చిన్న, కొండవీటి పాండురంగారావు, బర్మా శ్రీనివాసరావు, గురువాక మల్లికార్జునరావు, రేపల్లె మాధవరావు, మొగల్ మురాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధమే : కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి నియోజక వర్గ పార్టీ కార్యాలయ ఆవరణలో 'బందరు ప్రజలకు భవిషత్తు గ్యారంటీ' పేరుతో పార్టీ శ్రేణులతో ఏర్పాటుచేసిన వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రాక్షస పాలనా కొనసాగుతోందన్నారు. కక్ష సాధింపు, అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలతో భయానక వాతావరణాన్ని సృష్టించి పాలనా సాగిస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాల్జేశారన్నారు. అభివృద్ధిని పూర్తిగా విస్మరించి ఉన్న కంపెనీలను కూడా జె.టాక్స్ పేరుతో వేధిస్తుంటే పక్క రాష్ట్రాలకు యాజమానులు పారిపోతున్నారని విమర్శించారు. ఇలాంటి ప్రభుత్వం దేశం ఎక్కడా లేదన్నారు. ఈ దుర్మార్గమైన ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు అందుకే కార్యకర్తలు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉండాలని అయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటేనే ప్రజలు సుభీక్షంగా ఉంటారన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళు టిడిపి ప్రభుత్వం చూస్తుందన్నారు. కానీ ఒక్క ఛాన్స్ అంటూ అసత్య ప్రచారాలు చేసి అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి రివర్స్ పాలనతో రాష్ట్రాభివృద్ధిని తిరోగమనం పట్టించాడన్నారు. అనుభవ లేమి, పరిపాలన చేత కాక సామాన్యుడు దగ్గరనుండి వ్యాపారవేత్తల వరకు అందరినీ రోడ్డున పడేశాడన్నారు. దీంతో సామాన్య ప్రజలు విలవిల లాడిపోతున్నారు, రైతన్నలు భరోసా కేంద్రాల వద్దే తనువులు చాలిస్తున్నారన్నారు. దేశంలోనే రైతుల ఆత్మ హత్యలలో రెండోస్థానంలో మన రాష్ట్రం ఉందన్నారు. మచిలీపట్టణంలో పూర్తిగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. పేర్ని నాని ఆస్తులు మాత్రం



మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

పెరిగిపోతున్నాయన్నారు. ఇసుక, మట్టి, భూములు, దోపిడీ చేస్తూ ఆస్తులు పెంచు కుంటున్నాడన్నారు. ఇప్పుడు కొత్తగా పోర్ట్ పేరుతో ముచ్చటగా మూడో సారి దోపిడీకి సిద్ధమయ్యాడని ఆరోపించారు. నాడు రూపాయి ఖర్చు లేకుండా 23 బెర్తులు నిర్మాణం చేస్తామని చంద్రబాబు నాయుడు పనులు ప్రారంభిస్తే అధికారంలోకి వచ్చిన వైసిపి వారు పనులు రద్దు చేసి సొంతంగా తామే కడతామంటున్నారు. ఇప్పుడు 4 బెర్తులు కడతామంటూ దొంగ ప్రచారాలు చేస్తున్నారన్నారు. దీని కోసం రూ.5,500 ఖర్చు చేస్తున్నామంటున్నారన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యే తమ్ముడికి పనులు అప్పగించి వందల కోట్లు కొట్టేయాలని చూస్తున్నాడన్నారు. ఈ సమావేశంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం మండలం ఎస్ ఎన్ గొల్లపాలెం గ్రామంలోని ఎస్ సీ కాలనీ శ్మశాన వాటికలోని పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించారు. స్థానికులు సమస్యలను శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని)ని తెలిపారు. ఆయన అధికారులతో మాట్లాడి జేసిబి పంపించి సుమారు 18 గంటలు పాటు జంగిల్ క్లియర్ చేసి లెవలింగ్ చేయించారు. దీర్ఘకాలిక సమస్యను వెంటనే పరిష్కరించిన పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), ఎమ్మెల్యే పేర్ని నాని, అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వి.రాంబాబు, మాజీ సర్పంచ్ మట్టా మోహన నాంచారయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



అగ్నిమాపక దళం మాక్ డ్రిల్

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఏపీ విపత్తుల నివారణ సంస్థ అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఫైర్ ఆఫీసర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది మంగళవారం వైద్యశాలకు వెళ్లి ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనుకోని విధంగా అగ్ని



ప్రమాదాలు సంభవిస్తే సిబ్బంది అధికారులు చేపట్టాల్సిన చర్యలపై ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్ జై కుమార్ తో పాటు వైద్యులు, సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పనిచేద్దాం : బిసి నేతలు

ప్రజాశక్తి-గుడివాడ

గుడివాడ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా కలిసి కట్టుగా పనిచేద్దామని బిసి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు వెంకట నాగమల్లేశ్వరరావు, నియోజవర్గ అధ్యక్షులు దారం నరసింహారావు



పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి స్థానిక అంజనేయ పంక్షన్ హాలులో బిసి సంఘ నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జరిగిన జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలేల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు కె.యశోదాయామినిదేవి, ఉపాధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు, వై.గొవర్ధనరావు, అగస్తి అరివిష్ణు, బి.సోమశేఖర్, ఎం.పద్మ, రాధకృష్ణ, ఎం.వెంకటలక్ష్మి, ఉద్యోగ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

50వ డివిజన్‌లో వెలంపల్లి పర్యటన

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక 50వ డివిజన్‌లో ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు క్షేత్ర స్థాయిలో మంగళవారం పశ్చిమ



నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు పర్యటించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ 50వ డివిజన్‌లో అభివద్ధి పనులు ఎలా జరుగుతున్నాయి అని పరిశీలించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారకానికి కషి చేస్తున్నామన్నారు. కొండ ప్రాంత సమస్యలు పరిష్కారానికి కషి చేస్తున్నట్లు తెలిపారు. .గతంలో చంద్రబాబు ఎప్పుడూ కుప్పం వెళ్ళేవాడు కాదని, నేడు నెలకి మూడు రోజులు వెళ్తున్నాడన్నారు. పవన్ కల్యాణ్ వారాహికి టీడీపీ జండాలు కట్టాలనీ సలహా ఇచ్చారు. ఒంటరిగా పోటీ చేసే దమ్ము వున్న నాయకుడు జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో 175 సీట్లలో పోటీచేసేవారి పేర్లుచెప్పే దమ్ము చంద్రబాబు, పవన్‌కి వుందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ ఇంచార్జ్ బంక విజయ, చాముండేశ్వరి, శివ, పితా మోహన్, సైకం సాయిబాబు, కామరాజ్ హరీష్ కుమార్, కోడి వెంకట రమణ, ఎం.వీరాస్వామి, జీ .రాంప్రసాద్ ,కొక్కిలగడ్డ పార్వతి, రవుఫా,వివేకానంద, లక్ష్మన్, హరి, సూర్య కళ,చెక్క శ్రీనివాసరావు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉమేష్‌వరుణ్‌కు అభినందన

ప్రజాశక్తి-నందిగామ: తెలంగాణ ఎంసెట్‌లో మూడో ర్యాంకు సాధించిన నందిగామ పట్టణానికి చెందిన చల్లా విశ్వేశ్వరరావు,




దేవకిదేవి కుమారుడు ఉమేష్ వరుణ్‌కు మంగళవారం వారి స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఏచూరి రాము, మాజీ కో ఆప్టేడ్ కౌన్సిలర్ గోపి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

భూ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో జగనన్న శాశ్వత భూహక్కు- భూ రక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వేను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం భూముల రీసర్వే వివరాలు, సర్వే కోసం వినియోగించే పరికరాలను, సర్వే ద్వారా వస్తున్న ఫలితాలను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావుకి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్ మోహన్ రావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం జగనన్న శాశ్వత భూహక్కు- భూ రక్ష పథకం ద్వారా భూముల రీ సర్వేకు శ్రీకారం చుట్టారని, దాదాపు వంద సంవత్సరాల తర్వాత సమగ్ర స్థాయిలో భూ సర్వే జరుగుతుందని, దీనిలో పూర్తిస్థాయి ఆధునిక టెక్నాలజీ ద్వారా డ్రోన్ లను వినియోగించి, అక్షాంశాలు -రేఖాంశాలతో సహా పారదర్శకంగా సర్వే నిర్వహించి హద్దు రాళ్ళను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహమ్మద్ మస్తాన్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షులు దొంతి రెడ్డి దేవేందర్ రెడ్డి, చల్లా బ్రహ్మం, సొసైటీ చైర్మన్ పాములపాటి రమేష్, కౌన్సిల్ సభ్యులు పాకాలపాటి కిరణ్, బాపట్ల సాంబయ్య, తానూరి రాము, యాకుబ్ అలీ, మందా మరియమ్మ, విశ్వనాథపల్లి కృపారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించబోతున్న డ్రైనేజీ పనులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా




రాఘవేంద్ర మాట్లాడుతూ పట్టణంలోని 1, 6వ వార్డులను అనుసంధానం చేస్తూ డ్రైన్, 8, 9, 28వ వార్డు (చేపల మార్కెట్)లలో డ్రైనేజ్‌లను నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ తుమ్మల ప్రభాకర్‌రావు, కౌన్సిలర్లు వట్టేం మనోహర్, సామినేని మనోహర్, కో-ఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్ బాబు, మున్సిపల్ కమిషనర్ నాగ మల్లేశ్వర రావు, వైసిపి నాయకులు కన్నమాల శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి

శ్రీ అక్షర విద్యాసంస్థల చైర్మన్ శ్రీరామ్

ప్రజాశక్తి-కంచికచర్ల



ప్రతి విద్యార్థి అభ్యున్నతికి పరితపించే మనస్తత్వం కలిగిన అత్యుత్తమ అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యాబోధన శ్రీ అక్షర విద్యాసంస్థల్లో జరుగుతుందని శ్రీ అక్షర విద్యా సంస్థల ఛైర్మన్ గడుపూడి శ్రీరామ్, జ్యోతి అన్నారు. కంచికచర్లలో 15 సంవత్సరాల క్రితం చిన్నపాటి రేకుల షెడ్‌లో జూనియర్ కళాశాలగా ప్రారంభమైన అక్షర విద్యాసంస్థల ప్రస్థానం అనతి కాలంలోనే అధ్యాపకుల కృషి, విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రులు సహకారంతో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో అక్షర టెక్నో స్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలలుగా సువిశాలమైన స్వంత భవనాలు, ఏసి క్యాంపస్, డిజిటల్ రూపంలో విద్యాబోధన చేసే స్థాయికి చేరుకోవటమే కాక , నందిగామ లో కూడా గడచిన రెండేళ్లుగా శ్రీ అక్షర ప్రైమ్ ఏసి క్యాంపస్ తో పాటు,శ్రీ అక్షర వాగ్దేవి క్యాంపస్ పేరుతో నిర్వహిస్తూ సంస్థ దినదినాభివద్ధి చెందుతుందన్నారు. ప్రతి క్యాంపస్‌లోనూ ఐఐటి, జెఈఈ, నీట్ అధ్యాపకుల పర్యవేక్షణలో, ప్రణాళిక బద్ధమైన మైక్రో షెడ్యూలింగ్ ప్రోగ్రాం ద్వారా విద్యాబోధన జరుగుతుందన్నారు. సువిశాలమైన ఏసి క్లాస్ రూంలలో





సెక్షన్ కు 30 మంది విద్యార్థులు మాత్రమే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అత్యాధునికమైన కంప్యూటర్ ల్యాబ్, ప్రతిరోజూ ఆన్ లైన్ పరీక్షలు నిర్వహించే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి పై వ్యక్తి గత శ్రద్ధతో పాటు వారి రక్షణ కొరకు సిసి కెమేరాల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యతో పాటు ప్రీతి రోజు సాయంత్రం సమయంలో క్రీడలు నిర్వహిస్తూ, క్రీడల్లో ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించేందుకు ఫిజిక్స్ ఫెస్ట్, మాథ్య ఎంపవర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే దూర ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు కండిషన్ కలిగిన వ్యాన్, బస్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు.ఈ ఏడాది కంచికచర్ల శ్రీ అక్షర టెక్నో స్కూల్‌లో పదవ తరగతి పరీక్షల్లో గోకవరపు ఉష 585 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జేఈఈ మెయిన్స్ తో పాటు ఆంధ్ర, తెలంగాణ లో ఎమ్సెట్ ఎంట్రన్స్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు.

యాత్రికులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడిలో యాత్రికుల సౌకర్యార్థం మంగళవారం కూడా ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలకవర్గ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా



చైర్మన్ కర్నాటి రాంబాబు మాట్లాడుతూ మండుతున్న ఎండల నేపథ్యంలో దేవస్థానంలో యాత్రికులకు ప్రతిరోజూ మజ్జిగ పంపిణీ జరుగుతోందని తెలిపారు. దుర్గమ్మను కేంద్ర తాగునీరు, పారిశుధ్య శాఖ కార్యదర్శి విని మహాజన్, విజయవాడ సబ్ కలెక్టర్ అదితి సింగ్ దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహనాధికారి దర్భముళ్ల భ్రమరాంబ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దుర్గగుడి మహామండపంలో మంగళవారం హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. 15 రోజులకు సంబంధించిన నగదు రూ.2,70,67,270, బంగారం 586 గ్రాములు, వెండి 5.856 కిలోలు అమ్మవారికి సమర్పించుకున్నారు. ఆన్‌లైన్ ఈహుండీ ద్వారా 1,03,537 విరాళంగా చెల్లించుకున్నారు. హుండీల లెక్కింపునకు ఆలయ పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ, పాలకమండలి సభ్యులు పరిశీలించారు.



మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-వన్‌టౌన్: విద్యాధరపురంలోని కుమరపాలెం సెంటర్లో మున్సిపల్ కార్మికుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు పశ్చిమ నగర ఉపాధ్యక్షులు బి సత్యబాబు పాల్గొని, మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ జరుగుతున్న రాష్ట్ర జాతా బహిరంగ సభ జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సెలవులు లేకుండా పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు ఆదివారం పూర్తి సెలవులు అమలు చేసి కార్మిక చట్టాలను కాపాడాలని కోరారు. పెండింగ్‌ల జీతాలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి-మైలవరం: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. రామాయణం కథల పుస్తకాలు చదివించి చెప్పించారు. ఈ సందర్భంగా లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల లైబ్రేరియన్ సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుంచే క్రమశిక్షణ అలవాటు చేసుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సయ్యద్ అహ్మద్, రాజేంద్రప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ప్రభుత్వ సాయం

ప్రజాశక్తి-నందిగామ: పట్టణంలోని వైసిపి కార్యాలయంలో వెలది కొత్తపాలెం గ్రామానికి చెందిన కాలితిరిపి వెంకటేష్ రెండు నెలల కింద అప్పుల బాధతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోవడంతో ఆయన భార్య కాలితిరిపి వాణికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియో కింద మంజూరు చేసిన రూ.7 లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతోటి వీరప్రసాద్, యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో అసిస్టెంట్ మేనేజర్ మృతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణ సమీపంలోని ఆటోనగర్ చెందిన వివిఎస్ లాబరేటరీ ప్రైవేట్ లిమిటెడ్



కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న ఒరిస్సా రాష్ట్రం కొటక్ జిల్లాకు చెందిన ప్రకాష్ కుమార్‌నాయక్ (42) అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు జిఎం కొండ శశికాంత్ తెలిపారు. కుమార్‌నాయక్ కంపెనీలో గత ఎనిమిది నెలలుగా అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారని, 5వ తేదీన ఆరోగ్యం బాగాలేదని డ్యూటీ మధ్యలోనే ఉదయం 11 గంటలకు తన రూమ్‌కు వెళ్లాడని చెప్పారు. మంగళవారం ఉదయం ఆరు గంటలకు కంపెనీలో పని చేస్తున్న సాయి దుల్ ఇస్లాం అసిస్టెంట్ మేనేజర్ తన రూములో చనిపోయాడని, నోటి నుండి నురగ వస్తుందని చెప్పాడని తెలిపారు. దీనిపై జగ్గయ్యపేట ఎస్ఐ బి.వి.రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పసుపు కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏపీ మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పసుపు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు మంగళవారం ప్రారంభించారు. ముందుగా పసుపు పంట దిగుబడి, బహిరంగ మార్కెట్ రేటు వివరాలను రైతులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పసుపు క్వింటా మద్దతు ధర రూ.6850గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో కురిసిన వర్షాలకు పంట నాణ్యత స్వల్పంగా దెబ్బతినడంతో బహిరంగ మార్కెట్లో సరైన ధర పలకడం లేదని, ప్రస్తుతం రూ.5200 నుంచి రూ.5500 వరకు మాత్రమే పసుపుకు ధర పలుకుతుందన్నారు. ఈ క్రమంలో పసుపు రైతులకు మద్దతు ధర కల్పించి భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చిందని, మార్క్ ఫెడ్ ద్వారా నాణ్యమైన పంటను కొనుగోలు చేపట్టాలని ఆదేశించిందని చెప్పారు. ఒక్కో రైతు నుంచి గరిష్టంగా 30 క్వింటాళ్ల కొనుగోలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారని, రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహమ్మద్ మస్తాన్, ఏపీ ఆగ్రో డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, వైస్ చైర్మన్ నల్లమల్లి మురళి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, పెద్దవరం పిఏసిఎస్ అధ్యక్షులు మేరుగ రామకోటి రెడ్డి, సొసైటీ చైర్మన్ పాములపాటి రమేష్, యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, కొండా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పసుపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గుడివాడలో సిఎం సభకు విస్తృత ఏర్పాట్లు

మంత్రులు జోగి, ఆదిమూలపు ఆదేశం

ప్రజాశక్తి-గుడివాడ

గుడివాడలోని టిడ్కో గృహాలను ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 9వ తేదీన రానున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ వెల్లడించారు. గుడివాడ మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాలులో ముఖ్యమంత్రి కార్యక్రమ సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లా పోలీసు అధికారి పి.జాషువా, గుడివాడ శాసనసభ్యులు కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని)లతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్, ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ జిల్లాలో మూడు పర్యాయాలు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలు విజయవంతంగా నిర్వహించామన్నారు. గుడివాడ టిడ్కో గృహాలను ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 9వ తేదీన రానున్నారన్నారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా అందరూ సమన్వయంతో, పూర్తి బాధ్యతతో అన్ని ఏర్పాట్లు సజావుగా చేసి విజయవంతం చేయాలన్నారు. కొడాలి వెంకటేశ్వరరావు నేతృత్వంలో తొలిసారిగా టిడ్కో గృహాల ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా పాల్గొంటున్నారన్నారు. ఒకే చోట 8912 టిడ్కో గృహాల కాలనీ ఏర్పాటు కావడం చెప్పుకోదగ్గ విశేషమన్నారు. 30 వేల మందికి నీడనిచ్చే బృహత్తర కార్యక్రమమన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడంతో ముఖ్యమంత్రి జీవితాంతం గుర్తుండి పోతారన్నారు. ఈ టిడ్కో గృహాలు చూడముచ్చటగా బ్రహ్మాండంగా ఉన్నాయన్నారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువ వ్యవస్థ, విద్యుత్, మంచినీరు తదితర సౌకర్యాలు అన్ని సమకూర్చబడ్డాయన్నారు. పక్కనే జగనన్న కాలనీ కూడా ఉందన్నారు. వేసవి దృష్ట్యా బహిరంగ సభకు వచ్చే ప్రజలకు మంచినీరు, ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు కావాల్సినన్ని సిద్ధంగా ఉంచుకొని పంపిణీ చేయాలన్నారు. బహిరంగ సభకు వచ్చిన ప్రజలను సురక్షితంగా వారి గమ్య స్థానాలకు తిరిగి చేర్చే బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. హెలీప్యాడ్, బహిరంగ సభ ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. వేదికను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రోటోకాల్ ఏర్పాట్లు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సజావుగా చేయాలన్నారు. గృహాల ప్రారంభం సందర్భంగా లబ్ధిదారులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి కలెక్టరేట్లో నిరంతరం పనిచేసే కంట్రోల్ విభాగాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. హెలికాప్టర్ సిబ్బందికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చూడాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమం పూర్తి అయ్యేవరకు విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలుగకుండా పర్యవేక్షించాలన్నారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే చికిత్స చేసేందుకు వీలుగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. బహిరంగ సభకు వచ్చే వాహనాలకు పార్కింగ్ కు ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో పూల మొక్కలతో సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. గుడివాడ పట్టణంలో చెత్తా చెదారాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి తొక్కిసలాట జరగకుండా గ్యాలరీ ఇన్చార్జి అధికారులు బాధ్యత వహించాలన్నారు. బారికేడ్ ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, గుడివాడ ఆర్డిఒ పద్మావతి, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్

బాలికల వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

సంక్షేమాధికారిణి జ్ఞానసుందరి

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమాధికారిణి పి.జ్ఞాన సుందరి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వసతి గృహంలో ఎస్సీలకు-70 సీట్లు, పిహెచ్సి-12, ఎస్టీ-5, బీసీ-9, ఓసీ-4 మొత్తం 100 సీట్లు ఉన్నట్లు తెలిపారు. హాస్టల్లో చేరిన విద్యార్థులకు ప్రతీ రోజు ఉదయం పాలు, రాగి జావ, బెల్లం, ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్, వారానికి రెండు సార్లు చికెన్, 5 సార్లు గుడ్లు, పండ్లు అందజేస్తామని పేర్కొన్నారు. ట్రంక్ పెట్టె, పల్లెం, గ్లాసు, జంఖానా దుప్పటి ఇస్తామని పేర్కొన్నారు. కాస్మోటిక్స్ ప్రతినెలా (నిధుల లభ్యత బట్టి) విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తామని వివరించారు. పదో తరగతి విద్యార్థినిలకు ఉపాధ్యాయుల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ మైనార్టీ విద్యార్థులే అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థిని ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, తెల్ల రేషన్ కార్డు జిరాక్స్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రం, పాఠశాల టీసీ, బ్యాంక్ అకౌంట్, పాస్ పోర్టు సైజు ఫొటోలు -3, గత సంవత్సరం పరీక్షలో వచ్చిన మార్కులు వివరాలతో వసతిగృహంలో సంప్రదించాలని కోరారు. వివరాల కోసం చరవాణి : 9849204760లో సంప్రదించాలని కోరారు.



ఎస్సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి-గన్నవరం

ఎస్సీ వర్గీకరణపై అన్ని రాజకీయ పార్టీలు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని గన్నవరం నియోజకవర్గ మహాజన సోషలిస్టు పార్టీ (ఎమ్మెస్పీ) కన్వీనర్ మందా వేణుబాబు విమర్శించారు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు మిషన్ 50 డేస్ గో టు విలేజ్ కార్యక్రమంలో భాగంగా ముస్తాబాద గ్రామంలో ఎమ్మార్పీఎస్,ఎమ్మెస్పీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేణుబాటు బయట వర్గీకరణకు సై అంటూనే చట్టసభల్లో మాట్లాడకుండా మౌనంగా ఉండటంతోనే జాప్యం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ గన్నవరం నియోజకవర్గ కో కన్వీనర్ నల్లమోతు రాజు, కో కన్వీనర్ కలపాల వికాస్, పెటేటి కిషోర్ పాల్గొన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా దువ్వూరి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడుగా నందేటి రాజేష్, ప్రధానకార్యదర్శిగా పాల ప్రమోద్, కార్యదర్శి ఉయ్యూరు విజయ్ కుమార్, కోశాధికారి తోడేటి రమేష్ ఎన్నికయ్యారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ హర్షణీయం

ఎపివివిపి రాష్ట్ర అధ్యక్షులు ఉల్లి కృష్ణ

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని ఎపివివిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎపిఎన్జిఒ జిల్లా అధ్యక్షులు ఉల్లి కృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో ఏపిఎన్జీఓస్ అసోసియేషన్ ఈస్ట్ కృష్ణ అధ్వర్యంలో కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగుల ఆధ్వర్యంలో సిఎం జగన్మోహనరెడ్డికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. థాంక్యూ సి ఎం సార్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉల్లి కృష్ణ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పేద వర్గాలకే కాదు, ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగులకు అనుకూల నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వమని నిరూపించిందని తెలిపారు. 2014 జూన్ 2 లోపు 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని, కేబినెట్ సమావేశంలో కొత్త పిఆర్సీ కమీటి నియామకం చేస్తామని ఇచ్చిన హామీ అభినందనీయమన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగులను నియమించటం ఎప్పటికైనా ఇబ్బంది కరమేనన్నారు. ప్రతీ ఉద్యోగం కూడా రెగ్యులర్ పద్ధతిలో నియామకం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. వైద్య విధాన పరిషత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు రాష్ట్రంలో 10 వేలు, జిల్లాలో 600, బందరు ప్రభుత్వాసుపత్రిలో 30 మంది వరకు క్రమబద్ధీకరణతో ప్రయోజనం పొందనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో టౌన్ అధ్యక్షులు లక్ష్మణరావు, నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు గౌరీ, ఏపీ వివిపి టౌన్ అధ్యక్షులు రాంబాబు, కాంటాక్ట్ ఎంప్లాయిూస్ బాబా రామ్మోహన్, నాయకులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.



సిఎం జగన్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తున్న వైద్యశాఖ సిబ్బంది


ప్రముఖ మెకానిక్ సాంబయ్య మృతి

ప్రజాశక్తి-ఉయ్యూరు

ఉయ్యూరు పట్టణానికి చెందిన ప్రముఖ మోటార్ మెకానిక్, ఉయ్యూరు మోటర్ మెకానిక్ అసోసియేషన్ మండల అధ్యక్షులు మెంటి సాంబశివరావు (60) గుండెపోటుతో మంగళవారం మృతిచెందారు. ఆయన ట్రాక్టర్ మెకానిక్ మేస్త్రీగా మంచి గుర్తింపు ఉంది. ఉయ్యూరు పరిసర ప్రాంతాల్లో రైతుల ట్రాక్టర్లు రిపేర్లు చేసి మంచి గుర్తింపు పొందారు. ఆయన ఉయ్యూరుకి ఆటోనగర్ ఏర్పాటు చేయాలని మెకానిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆ ఉద్యమానికి నాయకత్వం వహించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో సమరశీలంగా పాల్గొనేవారు. వాటిని జయప్రదం చేయడంలో ఆయన ముందుండే వారు. మెంటి సాంబశివరావు భౌతికకాయాన్ని సిఐటియు నాయకులు కె.శివనాగేంద్రం, రత్నం భాస్కరరావు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సాంబయ్య మరణం కార్మికులకి తీవ్ర నష్టమని సిఐటియు నాయకులు తీవ్ర సంతాపం తెలిపారు. కార్మికోద్యమ స్ఫూర్తితో ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనే వారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సజ్జా బాలగంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు బి.రాజేష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నిమ్మాది గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న సింహాద్రి రమేష్‌బాబు

నూతన పెళ్లి జంటకు ఎంఎల్ఎ అభినందనలు

ప్రజాశక్తి-చల్లపల్లి

స్వచ్ఛ యార్లగడ్డ కన్వీనర్, డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు కుమార్తె స్వాతి రాజశేఖర్‌ల వివాహ రిసెప్షన్ మేకావారిపాలెంలోని ఆర్కే కన్వెన్షన్‌లో మంగళవారం జరిగింది. ఈ వేడుకల్లో అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, వైసీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌ఛార్జి కడవకొల్లు నరసింహారావులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

వాలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి-ఉంగుటూరు

ఉంగుటూరు మండలం నందమూరు సచివాలయం పరిధిలో 17 మంది వాలంటీర్లకు సేవా మిత్ర పురస్కారం, ప్రశంసా పత్రాన్ని అందజేసి సత్కరించారు. ఎంపిడిఒ జి.ఎస్.వి.శేషగిరిరావు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్ ఆశయాలకు అనుగుణంగా ప్రజల ఇంటి ముంగిటకు పథకాలను అందజేస్తూ, అవినీతి లేని స్వచ్ఛ పాలనకు తార్కాణాలుగా వాలంటీర్లు నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టి.బేబి, ఇఒ పిఆండ్ ఆర్‌డి ఎం.అమీర్ బాష, పంచాయతీ కార్యదర్శి జి.అప్పారావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న వాలంటీర్లు



పర్యావరణపై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, ప్రిన్సిపాల్ డాక్టర్ రాధా రమణశ్రీ, కె.పద్మావతి, వై.వరలక్ష్మి, బి.పద్మ తదితరులు

ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యాన ఘనంగా పర్యావరణ దినోత్సవం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యాన కొత్త ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలెంటీర్లు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం వారు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులు, వారి అటెండర్లకు పర్యావరణం, ప్లాస్టిక్ రహిత పర్యావరణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎన్‌ఎస్‌ఎస్ వాలెంటీర్లు వివరించారు. 'బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్' అన్న నినాదంపై అవగాహన కల్పించారు. ఈ అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వాలెంటీర్లు పాల్గొని ప్రథమ, ద్వితీయ బహుమతులను పొందారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రాధా రమణశ్రీ, అధ్యాపక బృందం వారు కళాశాల ఆవరణలో కొబ్బరి, మామిడి, జామ, నిమ్మ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.పద్మావతి, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వై.వరలక్ష్మి, వైస్

సచివాలయ వ్యవస్థ భేష్ : జల జీవన్ మిషన్ కార్యదర్శి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం, మైలవరం : గ్రామ వార్డు సచివాలయాల ద్వారా అన్ని రకాల సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచటం అభినందనీయమని కేంద్ర జల జీవన్ మిషన్ కార్యదర్శి విని మహాజన్ అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం జూపూడి, మైలవరం మండలం పొందుగుల గ్రామాల్లో ఆమె మంగళవారం పర్యటించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, సురక్షిత మంచినీటి లభ్యత అంశాల్లో కేంద్రం అందిస్తున్న నిధులతో చేపట్టిన కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. జూపూడి గ్రామం ఇప్పటికే బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా కేంద్రం గుర్తించిందన్నారు. అలాగే సురక్షిత మంచినీరు కూడా గ్రామ ప్రజలకు అందిస్తున్న తీరును ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా వ్యవస్థల అధికారులతో ఆమె ముఖాముఖిగా మాట్లాడి పలు వివరాలను తెలుసుకున్నారు. గ్రామాల అభివద్ధికి వివిధ పథకాలకు వస్తున్న విధుల వివరాలను రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్ ప్రత్యేక ప్రదాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, కేంద్రం ప్రభుత్వ నిధులతో జిల్లాలో జరుగుతున్న అభివద్ధి పనులను జిల్లా కలెక్టర్ డిల్లీరావు వివరించారు.



జూపూడిలో మొక్కను నాటుతున్న విని మహాజన్

గడువులోగా ప్రతి ఇంటికీ కుళాయి పథకం పూర్తి : మహజన్ ఆదేశం

మైలవరం మండలం పొందుగుల గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులతో జల జీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న, పూర్తయిన పనులను మహజన్ పరిశీలించారు. అనంతరం పొందుగలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.

హత్య చేసిన వైసిపి నేతను అరెస్టు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమాయమ్మ హత్యకు నిరసనగా మంగళవారం విజయవాడ లెనిన్ సెంటర్లో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సుప్రజ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై హింస పెరిగిపోతోందని, వేధింపులు, అత్యాచారాలు హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా రాయవారిపాలెంలో సోమవారం వైసీపీ నేత కొండలరావు ట్రాక్టర్‌తో తొక్కించి అంగన్‌వాడీ కార్యకర్త హనుమాయమ్మను హత్య చేశాడని అన్నారు. కానీ ఇంత వరకు నిందితుడిని అరెస్టు చేయలేదన్నారు. మృతురాలి కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డి.వి.కష్ణ మాట్లాడుతూ అక్క చెల్లెళ్ల అభ్యున్నతికి కషి చేస్తున్నామని చెబుతున్న ముఖ్యమంత్రి ఈ ఘటనపై స్పందించక పోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలోలాగానే వైసిపి ప్రభుత్వంలో కూడా మహిళలపై హింస పెరిగిందని అన్నారు. దీనిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్ శ్రీనివాస్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఏ.కమల, యూనియన్ అధ్యక్షురాలు గజలక్ష్మి, నాయకులు జైనీరత్నకుమారి, కళ్యాణి, శైలజ, పద్మావతి, అరుణ పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతా మంగళవారం కృష్ణాజిల్లా గుడివాడ చేరుకుంది. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమయ్య మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు నూకరాజు, రజిని, మల్లేశ్వరరావు, పి.రజనీ పాల్గొన్నారు.

నేడు కృష్ణాడెల్టాకు సాగునీరు

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేయనున్న సాగునీటి వివరాలను తెలిపారు. కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలోని సాగునీటి కాలువల మరమత్తు పనులకు టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేసినట్లయితే ఏప్రిల్, మే నెలల్లోనే పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులు పూర్తి చేసుకుని జూన్‌లో సాగునీరు విడుదల చేసే సమయానికి కాల్వలు సిద్దంగా ఉంటాయన్నారు. ఏపి స్టేట్ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ యం వి వి నాగిరెడ్డి, పామర్రు శాసన సభ్యులు కైలా అనీల్‌కుమార్, శాసన మండలి సభ్యులు మొండితోక ఎం.అరుణ్‌కుమార్, అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ మాట్లాడుతూ తమతమ నియోజకవర్గాల పరిధిలో పంట కాల్వలు, మినీ సాగునీటి ప్రాజెక్టుల్లో జరుగుతున్న పనులను సత్వరమే పూర్తి చేయాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈసమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ తిరుమలరావు, పులిచింతల ఎస్ఇ శ్రీరామకృష్ణ, ఏఇలు, డిఇలు, తదితరలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయవాడ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No.43/2022 in I.A. No.246/2020 in O.S.No.665/2020

బిట్వీన్:
చుక్కబొట్ల ప్రవీణ్ .... వాది/ పిటీషనర్

మరియు

1. చుక్కబొట్ల రవికాంత్ (డైడ్)
2. చుక్కబొట్ల రమాదేవి
3. చుక్కబొట్ల నాగపద్మజ ... రెస్పాండెంట్స్

టు,
చుక్కబొట్ల నాగపద్మజ, భర్త. (లేటు) రవికాంత్, తండ్రి. యర్రబోయిన రెడ్డయ్య, శ్రీకాకుళం గ్రామం, ఘంటశాల మండలం, కృష్ణాజిల్లా - ఆర్3.

పై నెంబరు పిటిషన్‌లోని 3వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్టు వారి ఎదుట మీ యొక్క హాజరు నిమిత్తము ది.20-06-2023నకు వాయిదా అయివున్నది. కావున మీరు పై తేదీన ఉ.10.30 ని.లకు స్వయముగా గానీ, న్యాయవాది గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణ లు ఉన్న తెలుపుకోవలెను. లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షములో తీర్మానింపబడును.

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ///

యం. వెంకటేశ్వరరావు
పిటీషనర్ తరపు న్యాయవాది,
విజయవాడ

మహారాజశ్రీ గుడివాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

S.O.P.No.3/2023

బిట్వీన్
1)నాగిరెడ్డి ఉమామహేశ్వరరావు
S/o లేటు సింహాచలం, హిందువు,
వయస్సు 59 సం॥, వ్యాపారం, డోర్.నెం.1/567,
R.T.C కాలని, గుడివాడ.
2)నాగిరెడ్డి జనార్ధనరావు, S/o లేటు సింహాచలం,
హిందువు, వయస్సు 59 సం॥, వ్యాపారం,
డోర్.నెం.1/567, R.T.C కాలని, గుడివాడ.
...పిటీషనర్స్

And

Nil ...రెస్పాండెంట్సు

కృష్ణాజిల్లా, గుడివాడ పట్టణం, కాలని నివాసి అయిన నాగిరెడ్డి సింహాచలం తండ్రి : శివయ్య తన జీవితకాలంలో వ్రాయించుకున్న ప్రాంసరినోటు బాకి వసూలు చేసుకొనుటకు, తన తదానంతరం జరగవలసిన యెర్పాట్లు ఏమి చేయకుండ మరణించినారు. సదరు లేటు నాగిరెడ్డి సంహాచలం నకు ఇద్దరు కుమారులు అనగా పై నెంబరు గల పిటీషనర్లు మాత్రమే హిందు వారసత్వ రీత్యా వారసులు వదిలి చనిపోయినారు అనియు, మరియు బాకీలు వసూలు నిమిత్తమై పిటీషనర్లు గుడివాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు వారి యందు పై నెంబరు గల పిటీషన్ అనగా Succession Certificate పొందుటకు దాఖలు చేసినారు. సదరు పిటీషన్ ది.15-06-2023వ తేదీన ఉదయం 10-30 గం॥లకు వాయిదా అయివున్నది. పై కోర్టు వారి యందు హాజరు అయి అభ్యంతరము గాని ఆక్షేపణలు గాని తెలియపరచగలరు. లేనియెడల ఏటువంటి అభ్యంతరములు లేవని భావించబడునని యిందు మూలంగా యావన్మందికి తెలియపరచటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం జారీచేయటమైనది)
గుడివాడ
ది.06-06-2023

ఇట్లు
వైకుంఠపు దేవకీనందన,
న్యాయవాది, గుడివాడ.
సెల్ : 92472 86553

దస్తావేజులు పోయినవి

కృష్ణాజిల్లా, తోట్లవల్లూరు మండలం, చాగంటిపాడు శివారు ఆళ్ళవారిపాలెం గ్రామానికి చెందిన ఆళ్ళ లక్ష్మీ పద్మజ అను నా యొక్క పొలం దస్తావేజులు పోయినవి. నాకు మా నాన్నమ్మ జొన్నల అంజమ్మ రాసిఇచ్చిన 0-49 సెంట్ల పొలం దస్తావేజులు సర్వే నెం. 3600/1976 మరియు అలాగే లింకు దస్తావేజును 1945/1975 పోయినవి. తోట్లవల్లూరులో జిరాక్స్ తీయించుకొని వస్తూ వుండగా జారిపోయినవి. దొరికిన వారు తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్‌లోగానీ, ఈ క్రింది అడ్రస్‌లో గాని ఇవ్వగలరు.

ఇట్లు
ఆళ్ళ లక్ష్మీపద్మజ,
భర్త : ఆళ్ళ శ్రీనివాసరెడ్డి,
చాగంటిపాడు శివారు ఆళ్ళవారిపాలెం
తోట్లవల్లూరు మండలం, కృష్ణాజిల్లా.
ఫోన్ : 8074599423

మహారాజశ్రీ విజయవాడ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No.42/2022 in O.S.No.665/2020

బిట్వీన్:
చుక్కబొట్ల ప్రవీణ్ .... వాది/ పిటీషనర్

మరియు

1. చుక్కబొట్ల రవికాంత్ (డైడ్)
2. చుక్కబొట్ల రమాదేవి
3. చుక్కబొట్ల నాగపద్మజ ... రెస్పాండెంట్స్

టు,
చుక్కబొట్ల నాగపద్మజ, భర్త. (లేటు) రవికాంత్, తండ్రి. యర్రబోయిన రెడ్డయ్య, శ్రీకాకుళం గ్రామం, ఘంటశాల మండలం, కృష్ణాజిల్లా - ఆర్3.

పై నెంబరు పిటిషన్‌లోని 3వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్టు వారి ఎదుట మీ యొక్క హాజరు నిమిత్తము ది.20-06-2023నకు వాయిదా అయివున్నది. కావున మీరు పై తేదీన ఉ.10.30 ని.లకు స్వయముగా గానీ, న్యాయవాది గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణ లు ఉన్న తెలుపుకోవలెను. లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షములో తీర్మానింపబడును.

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ///

యం. వెంకటేశ్వరరావు
పిటీషనర్ తరపు న్యాయవాది,
విజయవాడ

ORDER 22 RULE 9C PC
IN THE COURT OF THE PRL SENIOR CIVIL JUDGE GUDIWADA
IA.53/2023 IN IP 10/2022

Between:-
Thummala Janardhana Rao S/o(Late) Sreemannarayana, Hindu, aged about 60 Years, D.No.10/154-B1, Rajendra Nagar, 2nd Lane, Gudiwada, Krishna District.
...Petitioner/Plaintiff

And

1.Paladugu Rambabu(Died)
2.Paladugu Venkata Subba Rao, S/o Late Ram Babu, Hindu, aged about 63 years, Cultivation, Pedaparupudi Post & Mandal, Krishna District.
3.Paladugu Madhubala W/o. Late Arjuna Rao, Hindu, aged 56 years, D.No.11/108-4A, Gudiwada Post, Krishna District.
4.Paladugu Naga Venkata Sudheer, S/o. Late Arjuna Rao, Hindu, aged 27 years, D.No.11/108-4A, Gudiwada Post, Krishna District.
5.Paladugu Karthik, S/o. Late Arjuna Rao, Hindu, aged 25 years, D.No.11/108-4A, Gudiwada Post, Krishna District.
6.Raavi Sujatha, W/o Nagendra Prasad, Hindu, aged 58 years, Plot No.202, Uma Maheswari Towers, Ibrahimpatnam, Krishna District.
7.Thummala Jhansi Rani W/o. Janardhana Rao, Hindu, aged about 56 Years, D.No.10/154-B1, Rajendra Nagar, 2nd Lane, Gudiwada, Krishna District.
respondents 3 to 7 are the Proposed Legal Heirs of Deceased 1st Respondent
...Respondents

యీ నెంబరు లో IA.53/2023 లో Order 22 Rule 9C PC Abatement పిటీషనులో 4 వ రెస్పాండెంటుకు నోటీసు నిమిత్తం ది.16-06-2023వ తేదీకు వాయిదా వున్నది. కనుక వాయిదా రోజు ఉదయం 10-30 గం॥లకు 4వ రెస్పాండెంటు స్వయముగా గానీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడునని యిందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

వాయిదా ది.16-06-2023
Gudiwada,
20-05-2023

K.Ravi
Advocate For Petitioner.

ORDER 22 RULE 9C PC
IN THE COURT OF THE PRL SENIOR CIVIL JUDGE GUDIWADA
IA.54/2023 IN IP 10/2022

Between:-
Thummala Janardhana Rao S/o(Late) Sreemannarayana, Hindu, aged about 60 Years, D.No.10/154-B1, Rajendra Nagar, 2nd Lane, Gudiwada, Krishna District.
...Petitioner/Plaintiff

And

1.Paladugu Rambabu(Died)
2.Paladugu Venkata Subba Rao, S/o Late Ram Babu, Hindu, aged about 63 years, Cultivation, Pedaparupudi Post & Mandal, Krishna District.
3.Paladugu Madhubala W/o. Late Arjuna Rao, Hindu, aged 56 years, D.No.11/108-4A, Gudiwada Post, Krishna District.
4.Paladugu Naga Venkata Sudheer, S/o. Late Arjuna Rao, Hindu, aged 27 years, D.No.11/108-4A, Gudiwada Post, Krishna District.
5.Paladugu Karthik, S/o. Late Arjuna Rao, Hindu, aged 25 years, D.No.11/108-4A, Gudiwada Post, Krishna District.
6.Raavi Sujatha, W/o Nagendra Prasad, Hindu, aged 58 years, Plot No.202, Uma Maheswari Towers, Ibrahimpatnam, Krishna District.
7.Thummala Jhansi Rani W/o. Janardhana Rao, Hindu, aged about 56 Years, D.No.10/154-B1, Rajendra Nagar, 2nd Lane, Gudiwada, Krishna District.
respondents 3 to 7 are the Proposed Legal Heirs of Deceased 1st Respondent
...Respondents

యీ నెంబరు లో IA.54/2023 లో Order 22 Rule 9C PC Abatement పిటీషనులో 4 వ రెస్పాండెంటుకు నోటీసు నిమిత్తం ది.16-06-2023వ తేదీకు వాయిదా వున్నది. కనుక వాయిదా రోజు ఉదయం 10-30 గం॥లకు 4వ రెస్పాండెంటు స్వయముగా గానీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడునని యిందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

వాయిదా ది.16-06-2023
Gudiwada,
20-05-2023

K.Ravi
Advocate For Petitioner.

ORDER 22 RULE 9C PC
IN THE COURT OF THE PRL SENIOR CIVIL JUDGE GUDIWADA
IA.55/2023 IN IP 10/2022

Between:-
Thummala Janardhana Rao S/o(Late) Sreemannarayana, Hindu, aged about 60 Years, D.No.10/154-B1, Rajendra Nagar, 2nd Lane, Gudiwada, Krishna District.
...Petitioner/Plaintiff

And

1.Paladugu Rambabu(Died)
2.Paladugu Venkata Subba Rao, S/o Late Ram Babu, Hindu, aged about 63 years, Cultivation, Pedaparupudi Post & Mandal, Krishna District.
3.Paladugu Madhubala W/o. Late Arjuna Rao, Hindu, aged 56 years, D.No.11/108-4A, Gudiwada Post, Krishna District.
4.Paladugu Naga Venkata Sudheer, S/o. Late Arjuna Rao, Hindu, aged 27 years, D.No.11/108-4A, Gudiwada Post, Krishna District.
5.Paladugu Karthik, S/o. Late Arjuna Rao, Hindu, aged 25 years, D.No.11/108-4A, Gudiwada Post, Krishna District.
6.Raavi Sujatha, W/o Nagendra Prasad, Hindu, aged 58 years, Plot No.202, Uma Maheswari Towers, Ibrahimpatnam, Krishna District.
7.Thummala Jhansi Rani W/o. Janardhana Rao, Hindu, aged about 56 Years, D.No.10/154-B1, Rajendra Nagar, 2nd Lane, Gudiwada, Krishna District.
respondents 3 to 7 are the Proposed Legal Heirs of Deceased 1st Respondent
...Respondents

యీ నెంబరు లో IA.55/2023 లో 1వ రెస్పాండెంటు అయిన పాలడుగు రాంబాబు గారు ది. 8-6-2022వ తేదీన చనిపోయినందున వారసులుగా చేర్పించమని పిటీషను దాఖలు చేయగా IA.55/2023 లో 4వ రెస్పాండెంటుకు నోటీసు నిమిత్తం ది. 16-06-2023వ తేదీకు వాయిదా వున్నది. కనుక వాయిదా రోజు ఉదయం 10-30 గం॥లకు 4వ రెస్పాండెంటు స్వయముగా గానీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడునని యిందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

వాయిదా ది.16-06-2023
Gudiwada,
20-05-2023

K.Ravi
Advocate For Petitioner.

కౌలు రైతు పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చల్లపల్లి

ఈనెల 10 నుంచి ప్రారంభమయ్యే జిల్లా పాదయాత్రను జయప్రదం చేయాలని జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షులు శీలం నారాయణరావు, మరీదు సురేష్, సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా, కౌలు రైతులు బుర్రె రాజారావు, బుర్రె మారతమ్మ పిలుపునిచ్చారు. స్థానిక గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో పాదయాత్ర గోడపత్రికలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షల కుటుంబాలు కౌలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. బడుగుబలహీన వర్గాలు దళితులు, ఇతర పేదలు కౌలు పొలం తీసుకుని వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు ప్రకతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కౌలు రైతు దారుణంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేక పంట రుణాలు, భీమ, నష్టపరిహారాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గ్రామసభల ద్వారా గుర్తింపు కార్డు ఇవ్వాలని రైతు భరోసా 25 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకం తొలగించే వరకు కౌలు రైతులు తరపున కౌలు రైతుసంఘం పోరాటం చేస్తుందని, కౌలు రైతులు ఉద్యమానికి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షులు శీలం నారాయణరావు, మరీదు సురేష్, కౌలు రైతు సంఘం సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా, కౌలు రైతులు బుర్రె రాజారావు, బుర్రె మారతమ్మ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కౌలురైతుసంఘం నాయకులు

సిసిఆర్‌సికి చట్టసవరణ చేయాలి.

ప్రజాశక్తి - మొవ్వ

క్షేత్రస్థాయిలో వాస్తవ కౌలు రైతులకు ఇబ్బందికరంగా మారిన 2020 సిసిఆర్సి చట్ట సవరణ చేసి కౌలు రైతులను ఆదుకోవాలని ఆర్బికే అధికారికి ఏపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతులు వినతిపత్రం అందించారు. మంగళవారం చినముత్తేవి ఆర్బికేలో విఎఎ ఆమనికి ఈ మేరకు వినతిపత్రం అందించి తమ సమస్యలను వివరించారు. తమ విజ్ఞాపనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు, పులి శివరామకృష్ణ, కె.సాయికుమార్, జ్యోతిబసు, వెంకటేశ్వరరావు, పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాల్సిందే

సిపిఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు

పి.సత్యనారాయణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్ ఇచ్చే వరకూ పోరాడతామని సిపిఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు పి.సత్య నారాయణ హెచ్చరించారు. జిపిఎస్‌కి మెరుగులు దిద్ది క్యాబినెట్లో పెడుతున్నామని ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. ఆర్టికల్ 309 ప్రకారం రాజస్థాన్, చత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో రద్దైన సిపిఎస్ విధానం ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు రద్దు కాదో చెప్పాలని కోరారు. 3 లక్షల సి పి ఎస్ ఉద్యోగుల ప్రతినిధిగా ఆప్కాస్ రాష్ట్ర సంఘ నాయకులుగా, ఎపి రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ కష్ణాజిల్లా రెవెన్యూ సర్వీసెస్ (అస్సొసియేట్) అధ్యక్షులుగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేశారు.

మచిలీపట్నం తహశీల్దార్ బదిలీ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం తహశీల్దార్‌గా పనిచేస్తున్న డి.సునీల్‌బాబు బాపులపాడు మండల తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. సుదీర్ఘ కాలంగా మచిలీపట్నంలో పనిచేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఉన్నతాధికారులు బాపులపాడు బదిలీ చేశారు. మంగళగిరి సీ సీ ఎల్ ఏ లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీ విద్య మచిలీపట్నం తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు.

చంద్ర రాజేశ్వరరావు 109వ జయంతి

ప్రజాశక్తి-గన్నవరం

స్థానిక సీపీఐ కార్యాలయంలో కీర్తిశేషులు చంద్ర రాజేశ్వరవు 109వ జయంతి నిర్వహించారు. సీపీఐ కార్యవర్గ సభ్యులు, ఎస్టీయు రాష్ట మాజీ అధ్యక్షులు పెద్దు వెంకట రత్నం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కాట్రగడ్డ రామచంద్ర జోషి, కట్టవరపు విజయరావు, కటవరపు మోహనరావు, విక్టర్, కిరణ్, రమేష్, వెంకటేశ్వరవు, బాబు, రాఘవయ్య, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి చెరువుల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం మండలం ఎస్ ఎన్ గొల్లపాలెం గ్రామంలో మంగళవారం పంచాయతీ సిబ్బంది 22 తాగునీటి ఊట బావులను వెల్లవేశారు. మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) సూచనలు మేరకు గ్రామస్తులకు మంచినీటి కోసం ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేలా తగు చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మట్టా మోహన నాంచారయ్య, సచివాలయ కన్వీనర్ బోలెం సత్యనారాయణ, లుక్కా కృష్ణ, ఆకుల బాలకృష్ణ ,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పెదపారుపూడిలో

కొనసాగుతున్న సమ్మర్ క్యాంపులు

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాల మండల పరిధిలోని కొడాలి, ఘంటసాల, శ్రీకాకుళం శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. ఆయా శాఖ గ్రంథాలయ అధికారుల సమక్షంలో విద్యార్థిని విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో పుస్తక పఠనం, శరీర ధారుఢ్య కార్యక్రమాలు, ఇండోర్ గేమ్స్, కథలు చెప్పడం, పాటలు పాడడం పలు రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు చాలా బాగా ఉపయోగించుకుంటున్నారని కొడాలి, ఘంటసాల, శ్రీకాకుళం శాఖ గ్రంథాలయ అధికారులు ఎం.సుబ్బారావు, సుజాత, ఎం.శరత్ కుమార్ తెలిపారు. వేసవి శిక్షణా శిబిరాల్లో విద్యార్థినీ విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో హాజరై చక్కగా మంచి విజ్ఞానాన్ని నేర్చుకుంటున్నారన్నారు.

మానసిక ప్రశాంతతకు దోహదం

ప్రజాశక్తి-పెదపారుపూడి

ప్రతిఒక్కరూ యోగ సాధన చేయటం ద్వారా శారీరక, మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవచ్చునని విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు దంతనాల భాస్కరరావు అన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులకు యోగా గురించి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులను యోగాను నేర్చుకోవటం ద్వారా చదివిన విషయాలను బాగా గుర్తుపెట్టుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఘంటసాలలో

పారిశుధ్య కార్మికులకు హెల్త్ హైజెనిక్ కిట్లు

ప్రజాశక్తి-ఉయ్యూరు

రెడ్ క్రాస్ సొసైటీ మచిలీపట్నం సబ్ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో 75 మంది ఉయ్యూరు నగర పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి హెల్త్ హైజెనిక్ కిట్లు మంగళవారం పంపిణీచేశారు. నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చైర్మన్ వి.సత్యనారాయణ, కమిషనర్ పి.వెంకటేశ్వరరావు, రెడ్ క్రాస్ చైర్మన్ టిఎస్ఎస్ బాలాజీ, సెక్రటరీ బి.శంకరానంద్, అనంతయ్య, రాంబాబు పాల్గొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నగపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50మంది రక్తదానం చేశారు. నగరపంచాయతీ చైర్మన్ వి.సత్యనారాయణ ప్రారంభించారు. ఉద్యోగులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు రక్తదానం చేశారు. వీరిని చైర్మన్‌తోపాటు కమిషనర్ వెంకటేశ్వరరావు అభినందించారు. కౌన్సిలర్లు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న చైర్మన్ సత్యనారాయణ

కవుతరం పిఎసిఎస్‌లో

100 శాతం రుణాలు వసూలు


ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పరిధిలోని గుడ్లవల్లేరు బ్రాంచి పరిధిలో కవుతరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.10,59,86,000 వసూలు చేసి 100 శాతం రికవరీ సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి ఆడిట్ పూర్తిచేసి రూ.69 లక్షలు నికర లాభం అర్జించింది. ఈ విజయానికి తోడ్పాటు అందించిన రైతు సోదరులు, బ్యాంకు సిబ్బందికి ఛైర్మన్, కార్యదర్శి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌సిసి కేడెట్లకు పతకాలు

ప్రజాశక్తి-ఉయ్యూరు

ఏజీఅండ్‌ఎస్‌జీఎస్ కళాశాల ఎన్‌సిసి కేడెట్లు వివిధ సాంస్కృతిక, క్రీడా పోటీల్లో బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించారు. 17(ఏఎన్) బెటాలియన్ విజయవాడ ఆధ్వర్యంలో నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహించిన వార్షిక ట్రైనింగ్ క్యాంపు (ఏటీసీ)లో కళాశాలకు చెందిన 54 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్యాంపు ముగింపు సందర్భంగా నిర్వహించిన పోటీల్లో పురుషుల వాలీబాల్, డ్రిల్లో ప్రథమ, బాలుర 100 మీటర్లు, బాలికల 100 మీటర్ల పరుగు పోటీల్లో ప్రథమస్థానం సాధించారు. మహిళల త్రోబాల్ పోటీలో ద్వితీయ, బాలికల 200 మీటర్ల పోటీలో తృతీయ స్థానం సాధించి పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ, జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి పి.శ్రీరామేజ విద్యార్థులను అభినందించారు.



పతకాలకు ఎంపికైన కేడెట్లు

ఆస్టర్ రమేష్ అమరావతి హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-తిరువూరు: అంతర్జాతీయ స్థాయిలో వైద్య సేవలందిస్తున్న ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, మొట్ట మొదటసారిగా తిరువూరు నందు క్యాథ్ ల్యాబ్ మొదలైన అత్యాధునిక వైద్య పరికరాలతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ప్రారంభించినట్లు రమేష్ హాస్పటల్ చైర్మన్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు తెలిపారు. తిరువూరులోని హాస్పిటల్ కాన్ఫరెన్స్ హల్ నందు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ అమరావతి హాస్పిటల్‌తో కలిసి సంయుక్తంగా "ఆస్టర్ రమేష్ అమరావతి" హాస్పిటల్ ను అందుబాటులోనికి తీసుకువచినట్లు తెలిపారు. జిల్లా. పరిసర ప్రాంతాలలోనూ, ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సర్వీసులను అందించడానికి ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ముందుకు వచ్చిందని తెలియచేశారు. అత్యాధునిక క్యాత్ ల్యాబ్, సి.టి.స్కాన్, మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, సెంట్రల్ మానిటరింగ్ సిస్టమ్ ఉన్నాయని తెలిపారు. విజయవాడ హాస్పిటల్ నుంచి టెలి ఐ.సి.యు అనుసంధానంతో 20 పడకల ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను తిరువూరులో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. టెలీ ఎమర్జెన్సీ రూమ్, టెలీ ఐ.సీ.యు, టెలీ మెడిసిన్ మరియు టెలీ రేడియాలజీ వంటి అత్యాధునికమైన వైద్య సర్వీసులను 24 గంటలూ అందుబాటులోనికి తీసుకు వచ్చామని తెలిపారు. కార్డియాలజీ విభాగంలో డాక్టర్ రామ్ మనోహర్,



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

డాక్టర్ శివ ప్రసాద్, డాక్టర్ భరత్ సిద్దార్థ, డాక్టర్ వాసుదేవ్, డాక్టర్ జ్యోతి ప్రకాష్ రెడ్డి మరియు డాక్టర్ చంద్రమౌళి వంటి ఆరుగురు సీనియర్ కార్డియాలజిస్టులు వుంటారని అన్నారు. మెదడు నరము మరియు ప్రత్యేకమైన మూర్ఛ వ్యాధి నిపుణురాలు డాక్టర్ హరిణి, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ కార్తీక్, సీనియర్ జీర్ణకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ రాజేశ్ మరియు ప్రముఖ ఎముకలు కీళ్ల వైద్య నిపుణులు బర్డ్ హాస్పిటల్ మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదేష్ వైద్య సేవలందిస్తారనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరావతి హాస్పిటల్ డైరెక్టర్లు కోనేరు వెంకట కృష్ణన్, శావల దేవదత్, డాక్టర్ కృష్ణచైతన్య, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ గ్రూప్ సిఇఒ దేవానంద్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి శ్రీనివాసరావు, మేనేజ్మెంట్ కన్సల్టెంట్ డాక్టర్.ఎం.సి.దాస్, బిజినెస్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.



ఎన్‌టిటిపిఎస్‌లో మొక్కలు నాటిన అధికారులు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డాక్టర్ నార్లతాతారావు తాప విద్యుత్ కేంద్రం గేట్ నందు డైరెక్టర్ థర్మల్ ఎపిజెన్‌కో జి చంద్రశేఖర్ రాజు మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి పచ్చగా బ్రతకాలంటే భూమాత పచ్చగా ఉండాలన్నారు. విరివిగా చెట్లు పెంచడం వలననే మాత్రమే భూతాపమును తగ్గించవచ్చునన్నారు. లేకుంటే మన భవిష్యత్ తరాల వారు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో ప్రతి ముఖ్యమైన రోజు ఒక మొక్కను నాటగలిగితే భూ ప్రపంచం మొత్తం ఒక సుందర వనం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు పి నవీన్ గౌతమ్, పి అశోక్‌కుమార్‌రెడ్డి, టి నారాయణమూర్తి, టివి భాస్కరరావు, పి అనురాధ, కృష్ణారావు పాల్గొన్నారు.

నిమ్రాలో పర్యావరణ పరిరక్షణపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: జూపూడిలో నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవ సదస్సులో ముఖ్య అతిధులుగా కళాశాలల అకడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ టి ఎన్ మూర్తి మరియు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అక్బర్‌ఖాన్ పాల్గొని మాట్లాడుతూ ప్రపంచాన్ని కాలుష్య రహితంగా చేయడానికి ప్లాస్టిక్ వాడకాన్ని చెట్టు నరకడం పేపర్ వాడకం నీటి వృధా వాహనాల వినియోగం తగ్గించుటకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకై వ్యక్తిగతంగా ముందడుగు వేయాలని వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణపై వ్యక్తిగతంగా ముందడుగు వేయాలని వెల్లండించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థినీ విద్యార్థులలో అవగాహనను కల్పించానికి పలు రకాల కార్యకలపాలు సెమినార్లు పోటీలను నిర్వహించి బహుమతులను మొక్కలను అందజేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రొగ్రామ్ ఆఫీసర్ కళాశాల సిబ్బంది కలిసి పర్యావరణ పరిరక్షణ మాటలలో మరియు స్టేటస్‌లో కాదు చేతల్లో చూపిద్దాం అని నినదించారు.

రేపు సిఐటియు జీపుజాతా ముగింపు సభ



ప్రజాశక్తి-విజయవాడ: మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు చేపట్టిన రాష్ట్ర జీపు జాతా ముగింపు సభ ఈ నెల 8న స్థానిక ఎంబి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్ కోరారు. ఈ మేరకు స్థానిక శ్రీశ్రీ భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెండు జీపు జాతాలు గత నెల 30న ప్రారంభమై, ఈ నెల 8న ముగుస్తున్న సందర్భంగా విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె)లో సాయంత్రం ఐదు గంటలకు సభ జరుగుతుందని అన్నారు. దీనిలో మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగభూషణం, కె.ఉమామహేశ్వరరావు, ఇతర నాయకులు పాల్గొని మాట్లాడతారన్నారు. రాష్ట్రంలోని 123 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు కవర్ చేస్తూ అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ చివరిగా విజయవాడకు రెండు జీపు జాతాలు చేరుకుంటున్నాయన్నారు. మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించనట్లయితే రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ నగర ఉపాధ్యక్షులు టి తిరుపతమ్మ, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్, కమిటీ సభ్యులు సింగంపల్లి శ్రీను పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఓ మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి విజయవాడ పోక్సో కోర్ట్ స్పెషల్ జడ్జి డా. ఎస్. రజిని మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే ఎన్.టి.ఆర్ జిల్లా టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబాపురం ఏరియాకు చెందిన ఫిర్యాది తన కుటుంబంతో కలిసి జీవిఃస్తోంది. ఫిర్యాదికి ఇద్దరు ఆడపిల్లలు. అయితే ఫిర్యాది పప్పుల కంపెనీలో పని చేస్తుంటుంది. ఫిర్యాది రెండవ కుమార్తె (13) వన్‌టౌన్ ఏరియాలోని స్కూల్‌లో చదువుతుండగా, అదే ప్రాంతానికి చెందిన బందాల బాలయేసు ప్రతి రోజూ బాలిక వెంటపడుతూ వేధిస్తున్నాడు. ఈ కేసులో నిందితుడిపై నేరం రుజువైనందున మంగళవారం జడ్జి డా. ఎస్. రజిని నిందితుడు బంధాల బాలయేసుకి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు.



ఘనంగా పుష్కర బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీపద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల పుష్కర బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం శ్రీవారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ,కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు తదితర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో 250 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ప్రధాన అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు, ఆలయ సహాయ అర్చకులు శ్రీనివాసుల గోపీనాథ్, పొట్నూరి దుర్గాప్రసాద్, మజ్జి ఈశ్వరరావు, కామందుల నరసింహారావు, పిళ్లా విజయ్, పోతిన బేసికంటేశ్వరుడు, మజ్జి శ్రీనివాసరావు, గూడేల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ వన్‌టౌన్, వాగు సెంటర్ ప్రాంతంలో 48వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ ఇంటి సమీపంలోనే మేఘన అనే ఐదు సంవత్సరాల చిన్నారిపై మూడు వీధి కుక్కలు మంగళవారం ఉదయం ఒక్కసారిగా దాడి చేశాయి..దీంతో ఆ చిన్నారి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు చిట్టినగర్ వాగు సెంటర్ సమీపంలోని నివసించే చిన్నారిని ఇంటి ముందే మూడు వీధి కుక్కలు ఒకేసారి మీద పడి దాడికి ఎగబడి తీవ్ర గాయాలపాలు చేశాయి. ఈ నేపథ్యంలో బాలిక ఆర్తనాదాలు విన్న చుట్టుపక్కల వారు పరిగెత్తుకుంటూ వచ్చి రాళ్లు విసిరి కుక్కలను తరిమికొట్టడంలో ప్రాణాలతో బతికి బయటపడిందని స్థానికులు చెబుతున్నారు.



వెంటనే బాలికను తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. గత కొన్ని నెలలుగా వీధి కుక్కలు దాడులు ఎక్కువవుతున్న తరుణంలో కార్పొరేషన్ అధికారులు అప్రమత్తం కాకపోవడం వల్లే ఇటువంటి దాడులు మరలా పునరావృతం అవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలను నియంత్రించడంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. హైదరాబాదులో వీధి కుక్కల దాడిలో ఒక చిన్నారి తన ప్రాణాలను కోల్పోయిన సంఘటన జరిగినా విజయవాడలో అధికారులు అప్రమత్తం కావడం లేదనేది నగ్నసత్యంగా ఉందని అంటున్నారు. ప్రజల ప్రాణాలు పోతే గాని కార్పొరేషన్ అధికారులు స్పందించరేమో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి వీధి కుక్కల బారి నుంచి తమ ప్రాణాలను కాపాడాలంటూ ప్రజలు వేడుకుంటున్నారు.

కార్పొరేటర్ పరామర్శ

సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మంగళవారం బాలిక నివాసానికి చేరుకుని పరామర్శించి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి కుక్కల నియంత్రణ చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం వైఫల్య ఫలితంగా వీధివీధిన వీధి కుక్కల ఉదతంగా పెరుగుతున్నాయన్నారు. పిల్లలు, పాదచారులు వాహనదారులపై నిరంతరం దాడులు చేసి గాయాలు పాలవుతున్నారని ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పేద కుటుంబానికి చెందిన వీరికి ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పుండ్కర్‌కు విజ్ఞప్తి చేశారు. బాలికను పరామర్శించిన వారిలో 48 వ డివిజన్ సిపిఎం కార్యదర్శి ఎస్.కె చిన్న బాబు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్ శ్రీను తదితరులు ఉన్నారు.


చిన్నారిని పరామర్శిస్తున్న కార్పొరేటర్ సత్యబాబు